


## పుకార్లు.. షికారు.. ఏజెన్సీల ఎదుట బారులు..

**కాంగ్రెస్ అధికారంలోకి** రాగానే సిలిండర్‌ను రూ. 500కే ఇస్తామని ప్రకటించింది. కేవైసీ అప్‌డేట్ ఉంటేనే ఈ ధర వర్తిస్తుందని, ఆదాయ ధ్రువ పత్రం ఉంటేనే మహాలక్ష్మి పథకం అందుతుందని పుకార్లు షికారు చేస్తున్నాయి. దీంతో ప్రజలు గ్యాస్ ఏజెన్సీలు, మీ సేవ కేంద్రాల వద్ద కేవైసీ అప్‌డేట్ కోసం, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. కాగా ప్రభుత్వ పథకాలకు కేవైసీ అప్‌డేట్‌కు ఎలాంటి సంబంధం లేదని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

- ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



# ఆర్మూర్ బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు నోటీసు అందజేసిన 24 మంది కౌన్సిలర్లు
- చర్చనీయాంశమైన రాజకీయ పరిణామాలు
- గతంలోనూ ఇదే పరిస్థితి..
- అప్పట్లో పరిస్థితులను చక్కదిద్దిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 12: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతాపవన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును మంగళవారం కలిసి నోటీసు అందజేయడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత, భర్త పవన్, మరిది ప్రేమ్ తీరుపై సొంత పార్టీ కౌన్సిలర్లే కొంతకాలంగా అసహనంతో ఉన్నారు. గతంలోనూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధం కాగా.. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. అయినప్పటికీ వారి తీరులో మార్పు రాకపోవడంతో మరోసారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 30 మంది కౌన్సిలర్లలో 24 మంది ఈ మేరకు సంతకాలు చేశారు. రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నేతృత్వంలో క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. ఒక వేళ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గి ఎన్నికలు నిర్వహించినా.. పదవీకాలం ఆరు నెలల ముందుగానే చెక్ పవర్ రద్దు అయ్యే అవకాశం ఉండడంతో ఎవరు ముందుకు వస్తారో అని చర్చ జోరుగా సాగుతున్నది. ఒకవేళ కలెక్టర్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకపోయినా, ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూసినా ప్రత్యేక అధికారి పాలన తప్పదు.


కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు

# మాజీ స్పీకర్‌కు అభినందనల వెల్లువ


మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాజు తదితరులు

బాన్సువాడ టౌన్/ వర్ని/ నిజాంసాగర్, డిసెంబర్ 12: అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాసరెడ్డి ఘన విజయం సాధించారు. దీంతో నియోజకవర్గ నలుమూలల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు, అధికారులు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు. బాన్సువాడలోని ఆయన స్వగృహంలో మంగళవారం కలిసిన పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. మాజీ స్పీకర్‌ను కలిసిన వారిలో బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు తదితరులు ఉన్నారు. అంతకు ముందు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎర్రాపహాడ్ గ్రామ మహిళలు స్పీకర్‌కు మంగళహారతులు పట్టారు. చెడుపై మంచి విజయం సాధించిందని వారు ఆనందం వ్యక్తంచేశారు. వర్ని మండలం పొట్టిగుట్టతండా జగదాంబ దేవి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్పీకర్ పోచారం పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

### జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్, డిసెంబర్ 12: నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు అతిథి గృహంలో నీటి పారుదల, రెవెన్యూ, ఎంపీడీవో, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో మంగళవారం వేర్వేరుగా సమీక్షా సమావేశాలను నిర్వహించారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, ప్రగతిలో, పెండింగ్‌లో ఉన్న పనులతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను సిద్ధం చేయాలని సూచించారు. అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను నిర్వహించాలన్నారు. అనంతరం నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. బిచ్కుంద, బాన్సువాడ డివిజన్ల సీఐలు కృష్ణ, మురళితోపాటు ఆయా మండలాల ఎస్సైలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఏఈలు, నీటి పారుదల శాఖ ఈఈ సోలోమాన్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

# అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

### ఎంపీ ధీరజ్ సాహూపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిరసన

ఖలీల్‌వాడి, డిసెంబర్ 12 : దేశంలోనే అత్యంత అవినీతి పార్టీ కాంగ్రెస్ అని, యూపీఏ హయాంలో ప్రతిరోజూ కుంభకోణాలు వెలుగుచూసేవని, రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెంది రాజ్యసభ ఎంపీ ధీరజ్‌సాహూ వద్ద అక్రమంగా దాచిన గుట్టలకొద్ది నోట్లకట్టలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. సాహూపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ న్యాలం రాజు ఆధ్వర్యంలో నగరంలోనిధర్నా చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు మంగళవారం నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ధీరజ్‌సాహూ వద్ద దొరికిన రూ. 350 కోట్ల నగదు ఎవరిదో రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. దీనిపై ఇండియా కూటమి కూడా మౌనం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధీరజ్ సాహూ డబ్బులతోనే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర పేరిట దొంగ యాత్ర చేపట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో నారాయణయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శివ ప్రసాద్, రవి, కిశోర్ కుమార్, సందీప్, బుస్సాపూర్ శంకర్, మాస్టర్ శంకర్, గడ్డం రాజు, పుట్ట వీరేందర్, చిరంజీవి, సాయిపవర్, శ్రీధర్ పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో ఆందోళన చేపడుతున్న బీజేపీ శ్రేణులు





# పరామర్శ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను యశోద దవాఖానలో మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.